క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందజేయాలి

మండల ప్రత్యేక అధికారి రాజరత్నం



కేజీబీవీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న రాజరత్నం

కేశంపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని మండల ప్రత్యేక అధికారి రాజరత్నం పేర్కొన్నారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో కేజీబీవీ, కొత్తపేట గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హాస్టళ్లలో పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. దోమల బెడద లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పనులను రాజరత్నం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ గౌసియా, హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణ, ఎంపీఓ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

‘రోడ్డుకు మరమ్మతులు చేయించండి’

కొత్తూరు: పట్టణానికి కిలోమీటర్ దూరంలోని కేజీబీవీ హాస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎబీవీపీ మండల కన్వీనర్ నరేష్‌చారి శనివారం అధికారులను ఒక ప్రకటనలో కోరారు. కొన్నేళ్ల నుంచి రోడ్డుకు కనీస మరమ్మతులు చేయించకపోవడంతో వర్షాలకు గుంతలుగా మారాయని పేర్కొన్నారు. ఇరువైపులా రోడ్డుకు వీధి దీపాలు లేని కారణంగా రాత్రి వేళల్లో చీకట్లో ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో హాస్టల్ నుంచి పట్టణంలోకి వెళ్లేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి హాస్టల్‌కు వెళ్లే రోడ్డును మరమ్మతులు చేయించాలని కోరారు.

గణపతి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన

షాద్‌నగర్: పట్టణంలో పటేల్ రోడ్డులోని శివాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన సాక్షి గణపతి దేవాలయ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో నవగ్రహ పూజ, దుర్గాదేవి పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలు మహేశ్ వర్మ, శ్రీధర్ వర్మ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, జీటీ శ్రీనివాస్, టైలర్ రమేష్, గడ్డమీది సుధాకర్, మన్నె విజయ్, గోపాల మన్నె రంజిత్, ధన్‌రాజ్, పిట్టల అంజిబాబు, పరమేశ్వర్, విజయ్, మాణిక్యం, అశోక్, ప్రవీణ్, యాదిగిరి, కార్తీక్, అభిరాం, రవి, అంచ రాములు, గణేష్, మహేష్, శ్రీకాంత్ ఆలయ అర్చకుడు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య

షాబాద్: ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ముద్దెంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడలో మైసమ్మ, ఎల్లమ్మ దేవాలయాలు నిర్మించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, లావణ్య, దంపతులు కుమారుడు మనోజ్‌లు యజ్ఞ హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావంతో ప్రశాంతంగా ఉండొచ్చన్నారు. ప్రతిఒక్కరూ కొంత సమయాన్ని పూజలకోసం కేటాయించాలన్నారు.

లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా మచ్చేందర్

షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణంలోని బీఏఎం కళాశాలకు చెందిన అధ్యాపకుడు నీరటి మచ్చేందర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర లెక్చరర్స్ ఫోరం చైర్మన్ కత్తి వెంకటస్వామి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బీఏఎం కళాశాల అధ్యాపకులు మచ్చేందర్‌ను అభినందించారు.

వృద్ధురాలికి గాయాలు

కేశంపేట: ఆర్టీసీ బస్సు దిగుతున్న ఓ వృద్ధురాలు డ్రైవర్ అజాగ్రత్త కారణంగా తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కాకునూర్ గ్రామానికి చెందిన ఢిల్లీ సత్యమ్మ షాద్‌నగర్ నుంచి గ్రామానికి వెళ్తోంది. ఈ క్రమంలో కేశంపేటలో వైఎస్సార్ చౌరస్తా బస్టాప్‌లో బస్సు దిగుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు కదిలించాడు. దీంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు.



షాద్‌నగర్ రూరల్: చిన్నికృష్ణుడు గోపికలు



చేవెళ్ల: కృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నియోజకవర్గంలో పలు మండలకేంద్రాల్లోని ఆయా పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. ప్రజలు ఇళ్లలో ఈ వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం పలువురు పిన్సిపాల్స్ మాట్లాడారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకలని పేర్కొన్నారు.



షాబాద్: హైతాబాద్‌లోని ఓ పాఠశాలలో..



షాద్‌నగర్ రూరల్: గోపికలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



మొయినాబాద్ రూరల్: రాధా వేషధారణలో..

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్య శ్రీ పథకం కింద పేదలకు రూ.10లక్షల వరకూ వైద్యాన్ని ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరుపేదల ఆరోగ్యభద్రతే లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, సయ్యద్‌సాధిక్, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణ, సుదర్శన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్



వీరన్నపేటలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

కొందుర్గు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్య లు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని వీరన్నపేట, గాలిగూడ గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతీ విద్యార్థికి ఉచిత యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు అందజేశారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను సరిచూశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ హన్మంతు రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



షాబాద్: మద్దూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం జయరాజ్, నర్సింహులు, డేవిడ్‌రెడ్డి తదితరులు

ఉపాధ్యాయ వృత్తి గొప్పది

- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి

షాబాద్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని మద్దూరు ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న శంకర్, మాలిని, స్వరూపలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాజ్‌తో పాటు వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని చెప్పారు. తమ పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉన్నా ఉద్యోగులకు ఇది సహజమన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడికి బదిలి తప్పనిసరన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిదరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: మండలంలోని ఉత్తరాసిపల్లి పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ఘనంగా సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు వీరాచారి, కౌసల్యలను వారు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్‌పార్టీ మండల కన్వీనర్ డప్పు రవీందర్ మాట్లాడుతూ అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే చైతన్య శిల్పి ఉపాధ్యాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డి, విశ్రాంత వీఆర్వో గోపాల్‌రావు, అంగన్‌వాడీ టీచర్ శారద, గ్రామస్తులు వాజీద్, అబీబ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: దేశ భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించి దేశానికి న్యాయవాదులు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, వైద్యులతో పాటు పలువురిని తయారు చేస్తారని వివరించారు. అందుకే ఎప్పటికీ సమాజంలో ఉపాధ్యాయులకు ప్రథమ స్థానమన్నారు. స్వామి, రఘుపాల్, మణివర్ధన్, ఖాజా, నుస్రత, గణేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా నిర్వహించుకోండి

- నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

నందిగామ: రాబోయే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం నందిగామలోని రైతువేదిక ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని మండపాల నిర్వాహకులు ముందస్తుగా పోలీస్ అనుమతి తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత శాఖ నుంచి అనుమతులు కోరాలన్నారు.వినాయకుడి మండపాల సమీపంలో తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటల వరకు సౌండ్ సిస్టమ్‌ను బంద్ చేయాలని,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాల కృష్ణ, మండపాల నిర్వాహకులు అశోక్, శ్రీశైలం, రాములు, దేపల్లి కుమార్, కొమ్ము కృష్ణ, యువజన సంఘాల నేతలు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కొత్తూరు సీఐ నర్సింహ్మారావు యువజన సంఘాలు, మండపాల నిర్వాహకులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువజన సంఘాల నాయకులు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసే మండపాల్లో నిర్వాహకులు ట్రాన్స్‌కో, పోలీస్ అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్, మండపాల నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.



నందిగామ: సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రసాద్



కొత్తూరు: మాట్లాడుతున్న సీఐ నర్సింహ్మారావు

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

- చేవెళ్ల, అల్వాల్ సీఐలు భూపాల్ శ్రీధర్, రాజేందర్‌గౌడ్



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని పూజకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న అతిథులు

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఐలు భూపాల్ శ్రీధర్, రాజేందర్‌గౌడ్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం వివేకానంద జూనియర్, డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ భూపాల్ శ్రీధర్, అల్వాల్ సీఐ (కళాశాల పూర్వ విద్యార్థి) రాజేందర్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని, దీనిని వృథా చేయొద్దన్నారు. గొప్ప, గొప్ప లక్ష్యం పెట్టుకుని వాటిని సాధించే వరకూ వెనుకడుగు వేయొద్దని సలహాఇచ్చారు. బాగా చదువుకొని పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు, కళాశాలకు కీర్తి తీసుకరావాలన్నారు. అల్వాల్ సీఐ రాజేందర్‌గౌడ్ ఈ కళాశాలలోనే చదివి ఈ స్థాయికి ఎదిగినందుకు ఎంతో గర్వంగా ఉందని కళాశాల యాజమాన్యం పేర్కొన్నారు. అనంతరం కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎ. పూజకు ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందజేశారు. పదోతరగతిలో 10జీపీఏ సాధించిన సాయి మనోజ్ఞకు రూ. 10వేలు ప్రోత్సాహకంగా కళాశాల తరుపున ముఖ్యఅతిథులు అందజేశారు. కళాశాల చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఇంద్రసేనా రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేలో చిన్నారికి గోల్డ్ మెడల్



మెడల్ సాధించిన చిన్నారితో కరాటే మాస్టర్

షాబాద్: కరాటే పోటీలో చిన్నారి గోల్డ్ మెడల్ సాధించింది. లక్ష్మారావుగూడ గ్రామానికి చెందిన మేకల విజయ్ శేఖర్, ప్రభావతి కూతురు జ్ఞాన తేజ శనివారం బెంగళూరులో జరిగిన ఓపెన్ శివ మొగ్గ ఇంటర్నేషనల్ స్థాయి కరాటే పోటీలో ప్రథమస్థానంతో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. మొయినాబాద్‌లో సుజాత ఇంటర్నేషనల్ స్కూల్లో మూడోతరగతి చదువుతుంది. మెడల్ సాధించిన చిన్నారిని కరాటే మాస్టర్ సింహన్, సుధాకర్ అభినందించారు.

కబ్జా దారులపై చర్యలకు వినతి



డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సజ్జన్‌పల్లి గ్రామస్తులు

మొయినాబాద్: సజ్జన్‌పల్లిలో ప్రభుత్వం పదిహేడేళ్ల క్రితం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని శనివారం సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కె శ్రీనివాస్ మాట్లాడుతూ 2007లో ప్రభుత్వం గ్రామంలోని 72 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇచ్చిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో కొంత మంది ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇళ్ల స్థలాలపై కన్నేసి కబ్జాచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని తమ ఇళ్ల స్థలాలను పరిరక్షించాలని కోరారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్ న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో రైతు సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, గ్రామ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గ్రామస్తులు రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ప్రశాంత్, నర్సింలు, విఠలయ్య పాల్గొన్నారు.

‘ఉన్నత విద్యలో రాణించాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, అనురాగ్ విద్యా సంస్థల చైర్మెన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యా జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి విద్యా దోహదపడుతుందన్నారు. జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో నాణ్యమైన అధ్యాపకులతో పాటు పరిశోధన కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబరెడ్డి, కళాశాల డీన్ డాక్టర్ పద్మజ, అకాడామిక్ కోఆర్డినేటర్ శ్రీలత, ఏవో వెంకటాచలం పాల్గొన్నారు.

మొయినాబాద్: సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు సమాజ అభివృద్ధిపై దృష్టి సారించాలని స్పెక్టాన్ ఆటోమ్ స్టేట్ కో ఫౌండర్, సీఈఓ వెంకట సుబ్రహ్మణ్యం, ఫినొలెక్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ గుణేశ్ భద్రాకి పేర్కొన్నారు. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతికతను సమాజాభివృద్ధికి ఉపయోగపడేవిధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ప్రశాంత్ లింగం, కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, డీన్ మంతెన నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.